# దేవుడు కీడును కలిగించాడా?

దేవుడు దయామయుడు ప్రేమాస్వరూపి, కీడు చేయనివాడని ఆలోచించడానికి (సరిగానే) అలవాటు పడినవాడు, బైబిల్లో ఈ క్రింది లేఖన భాగం చదివినప్పుడు కలత చెందవచ్చు: "నేను వెలుగును సృజించువాడను అంధకారమును కలుగజేయువాడను సమాధానకర్తను కీడును కలుగజేయువాడను నేనే యెహోవా అను నేనే వీటినన్నిటిని కలుగజేయువాడను" (యెషయా 45:7; KJV).[1]

దేవునికి మంచితనంగాని లేక శక్తిగాని లేనివాడని కీడు యొక్క ఉనికి చూపుతున్నట్టు డేవిడ్ హ్యూమ్ వాదించాడు. ఎపిక్యూరస్ ఈ ప్రశ్నలనడిగాడు:

> ఆయన కీడును అరికట్టడానికి యిష్టపడుతూ, చేయలేకున్నాడా? అప్పుడు ఆయన శక్తిహీనుడు. సమర్థుడేగాని, యిష్టపడకయున్నాడా? అప్పుడు ఆయన చెడుగు తలంచువాడై యున్నాడు. ఆయన సమర్థుడును, యిష్టంగలవాడైయున్నాడా? అప్పుడు కీడు ఎక్కడనుండి వచ్చింది?[2]

ఇది ఒక అహంభావముతో కూడిన వాదన అయినా, కీడు అనే మహా గొప్ప సమస్యతో అనేకమంది యథార్థవంతులు కుస్తీపట్టారు. ఈ వాదన అన్ని వాస్తవాలు ఎరిగినట్టు ఊహిస్తుంది. సంపూర్ణమైన జవాబు నరుడు యివ్వలేనట్టు కన్పిస్తాడు. బైబిలు బయల్పాటు కొన్ని జవాబులను, ప్రాక్టికల్ సలహాలను యిస్తుంది.

## నైతిక కీడుకు దేవుడు కారణం కాదు

కీడులో ఒకటి కంటె ఎక్కువ రకాలున్నాయని బైబిలు చూపుతుంది నైతిక కీడు (హత్య వంటిది) "పవిత్రుడైయున్న" వానికి (1 యోహాను 3:3), సంపూర్ణంగా పరాయిదే. మన దేవుడు, "నిర్దోషియై నమ్ముకొనదగిన దేవుడు ఆయన నీతిపరుడు యథార్థవంతుడు" (ద్వితీయో. 32:4). "దేవుడు కీడువిషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని శోధింపడు ..." అని దైవ ప్రేరేపితుడైన యాకోబు అన్నాడు (యాకోబు 1:13). దేవుడు "ప్రేమా స్వరూపియైతే" (1 యోహాను 4:8), ఆయన కీడును కలిగినవాడైయుండడం అసాధ్యం. అందువలన, నైతిక కీడు దేవునికి చెందనిదైయుంది.

## అవిధేయతకు దండనగా దేవుడు కీడును కలిగిస్తాడు

ఏ విధమైన నైతిక కీడునుండియు దూరమునకు తొలిగి, "క్రమశిక్షణతో కూడిన కీడు" అని వర్ణింపబడే కీడు ఉంది. దానిని గూర్చి దేవుడు తాను కర్తయు సృజించినవాడనని చెప్పుకున్నాడు.

ఆదియందు ఆయన చేసిన ప్రతి పనియు "చాలా మంచిదై"యుండగా (ఆది. 1:31)[3] ఆదాము హవ్వలు అవిధేయులైనప్పుడు, తన మంచి లోకాన్ని శపించేలా దేవుడు బలవంత పెట్టబడ్డాడు. అప్పుడు ముండ్లతుప్పలు, కలుపు, పాటు (కష్టపడే పని), వేదన, వ్యాధులు. పరాన్నజీవులు, వర్షలేమి, తుఫానులు, భూకంపాలు కలిగాయి. దేవుడు తన గొప్ప జ్ఞానంలో, మరణాన్ని అవిధేయతకు దండనగా విధించాడు (ఆది. 3:17, 18 చూడు). "ఆదాము చేసిన అతిక్రమమును పోలి పాపము చేయనివారికి" కూడా (రోమా 5:14) మరణం సంప్రాప్తమయ్యింది. తండ్రి బిడ్డలు ఒకరి బాధలను ఒకరు పంచుకోగలరు, కాని ఒకరి దోషాన్ని మరొకరు అనుభవించరు (యెహేజ్కేలు 18:20). పాపము యొక్క ఫలితము అందించబడవచ్చు (నిర్గమ. 20:5), అయితే దోషం మాత్రం కాదు (రోమా 14:12).

తరువాత పాత నిబంధన చరిత్రలో, ఒక దుష్ట పురాన్ని చదును చేసి రమ్మని దేవుడు వారి శత్రువులను పంపినప్పుడు, అది పరలోకంనుండి పంపబడిన క్రమశిక్షణా కార్యమైయుంది. ఆమోసు 3:6 యిలా అంటుంది: "పట్టణమందు బాకా నాదము వినబడగా జనులకు భయము పుట్టకుండునా? యెహోవా చేయనిదే పట్టణములో ఉపద్రవము కలుగునా?" శిక్షగా నిర్వచింపబడిన కీడు యెరూషలేము పట్టణానికి సంభవించినట్టు యిర్మీయా స్థిరపరచాడు: "నా పేరు పెట్టబడిన పట్టణమునకు నేను కీడు చేయ మొదలుపెట్టగా మీకు శిక్ష లేకుండ పోవునా? మీరు శిక్షింప బడకుండ పోరు ..." (యిర్మీయా 25:29).

ఖడ్గము, కరవు, నాశనము అనేవి దేవుని యొక్క క్రమశిక్షణతో కూడిన కీడుకు ఉదాహరణలు, "మేలు చేయుటకుకాక కీడుచేయుటకే నేను వారిని కనిపెట్టు చున్నాను ..." అని మనం చదువుతాం (యిర్మీయా 44:27); "... గొప్ప అపాయ కాలము వచ్చుచున్నది. దాని క్రిందనుండి తమ మెడలను తప్పించుకొన లేకుండునంతగాను, గర్వముగా నడువ లేకుండునంతగాను ఈ వంశమునకు కీడుచేయ నుద్దేశించు చున్నాను" (మీకా 2:3).

ఇంకను జన్మించని పారసీకదేశపు రాజైన కోరెషునకు పరలోకంనుండి పంపబడిన ఆజ్ఞను యెషయా 45:7 యొక్క సందర్భం సూచిస్తుంది. ఆ ఆజ్ఞనుబట్టి తన ఎదుటనున్న దేశాలను వశపరచుకొంటూ వెళ్లతాడు. క్రమశిక్షణతో కూడిన కీడును దేవుడు అనేక దేశాలమీదికి పంపుతాడు, మరియు, కోరెషు అందుకు పరలోకము యొక్క సాధనమై యుంటాడు.

అందువలన, ఏ కీడు చేయడంలోను దేవుడు సంబంధం లేనివాడైయుండగా, పరిశుద్ధమైన క్రమశిక్షణయందు ఆయన "కీడును కల్పిస్తాడు."

## క్రమశిక్షణా ప్రమాణంగా దేవుడు కీడును కల్పిస్తాడు

దేవుని (ప్రకృతి లేక బయల్పాటుకు సంబంధించిన) చట్టాలను అతిక్రమించనివారు, తాము విత్తని దానిని కూడా కోయువారున్నారు (గలతీ. 6:7); అంటే, వారు అనేక విధములైన బాధలు అనుభవిస్తారు. తన దేహంలోని కురుపులకు యోబు నిజంగా

పాత్రుడు కాదు. అయితే అతని ఎరుక లేకుండగనే – అలాటి కురుపులు వచ్చేలా అనుమతించడంలో దైవికమైన ఉద్దేశం ఉంటుంది. యోబు ఎంత మంచివాడంటే, తన స్థితిని గూర్చి దేవుని దూషింపక (యోబు 2:9, 10), తన ఓర్పును సాధకం చేసికొన్నాడు (యాకోబు 5:11). యోబునందు ఆత్మ స్తుతి చేసికొనే స్వభావం, తిరుగుబాటు తనం అనేవి గోచరిస్తున్నట్టున్నాయి (యోబు 13:2, 3; 23:2 చూడు). ఓర్పులో కొరత (యోబు 21:4) లేదా? అతనికి మెరుస్తున్న కండ్లు (యోబు 15:12) మరియు తన సృష్టికర్తతో వాదించాలనే తత్వం ఉంది (యోబు 13:3). అతని కష్టకాలం అతన్ని అణచింది. దేవుని గద్దింపును అతడు విన్నప్పుడు, "దుమ్ములోను, బూడిదలోను" కూర్చుండి అతడు మారుమనస్సు పొందాడు (యోబు 42:6). వేరు విధంగా అతడు మారలేనంతగా క్రమశిక్షణతో కూడిన కీడును బట్టి అతడు శ్రేష్ఠుడైన వ్యక్తి అయ్యాడు.

"తన దేహంలో గుచ్చుకునే ముల్లు" ఉండడానికి పౌలు చేసిన తప్పు ఏమియులేదు (2 కొరింథీ. 12:7). అది తొలిగి పోవాలని ప్రార్థించాడు. పౌలును వినయంగా ఉండునట్లు నిలపడానికిగాను దేవుడు దానిని ఉంచాడన్న సంగతి ఎరుగకలేక పోయాడు. తన ముల్లును బట్టి అతడు దేవుని దూషించేదానికి బదులు, తన తండ్రి అతనిని అంతగా ప్రేమించి నందుకు పౌలు కృతజ్ఞత కలిగియున్నాడు. "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" అనే గ్రహింపుకు వచ్చి చేరుకున్నాడు (2 కొరింథీ. 12:10). హెబ్రీ. 12:11 యిలా అంటుంది: "మరియు ప్రస్తుతమందు సమస్తశిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును."

క్రీస్తు ప్రభువు సయితము తాను పొందిన శ్రమవలన విధేయత నేర్చుకొన్నాడు. ఆయన కూడా విడుదల కొరకు ప్రార్థించాడు. అయినా తన్ను సంపూర్ణునిగా చేయడానికి క్రమశిక్షణ అవసరమైయున్నట్టు దేవుడు చూచాడు (హెబ్రీ. 5:7-9).

## పరులకొరకైన కీడును దేవుడు కలిగించినవాడైయున్నాడు

తన వ్యక్తిగతమైన పరిపూర్ణతకు తోడు, క్రీస్తు యేసుకు వచ్చిన కఠోరమైన వేదనలో మరొక ఉద్దేశముంది. దానియందు ఆయన, "అనేకుల పాపమును తానే భరించాడు" (యెషయా 53:12), "మనకొరకు పాపముగా" చేయబడ్డాడు (2 కొరింథీ. 5:21). ఆయన పరులకు ఉపకారం చేయడానికి కీడును అనుభవించాడు.

ఒకడు జన్మతోనే గుడ్డివాడుగా పుట్టాడు. (కొన్ని సందర్భాలలో తల్లిదండ్రుల పాపం అందుకు కారణమైయున్నా) అతని సందర్భంలో మాత్రం వాడు గుడ్డివాడై జన్మించడానికి వాని తల్లిదండ్రులు కారకులు కారు సరిగదా (కొన్ని సార్లు తమ గుడ్డితనానికి వారే కారకులైయుంటారు కాని), తాను కూడా దానికి కారణం కాదు. ఆ మనిషి గుడ్డి తనానికి దైవికమైన ఉద్దేశం ఉంది (యోహాను 9:1-3). "... ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు" (రోమా 11:33). దేవుని ఆలోచన బయలుపరచబడినప్పుడు నరులు ఆశ్చర్య చకితులై నిలిచియుంటారు.

## ముగింపు

ఒకనికి జవాబులన్నీ లేనప్పుడు, దేవుని మీద నిందవేయడానికి అతడు సిద్ధంగా లేడు. ఆయన మేలు చేయవాడైయుండి, “ఆకాశమునుండి మీకు వర్షమును, ఫలవంత ములైన రుతువులను దయచేయుచు, ఆహారము ననుగ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపు”వాడైయున్నాడు (అపో. 14:17). ఉన్నవాటి రుజువు మీద విశ్వాసం ఆధారపడియుంటుంది (హెబ్రీ. 11:1), కాని విశ్వాసంలో నమ్మిక యొక్క ప్రథమ సూత్రం కూడా ఉంటుంది. విశ్వాసం సంపూర్ణంగా ప్రదర్శించబడేదై ఉన్నట్టయితే, అది విశ్వాసమైయుండదు. మంచి దేవుని కొరకైన రుజువు దానికి వ్యతిరేకమైన దానికంటే ఎంతో బలీయంగా ఉంది (కీర్తన. 40:5). ఉన్న రుజువులన్నీ ఆలోచించిన తదుపరి యథార్థవంతుడు ఒప్పుకున్నవాడై, “నమ్ముచున్నాను, అపనమ్మిక కలుగకుండ చేయుము” అని ప్రార్థించాలి (మార్కు 9:24). గర్వ స్వభావం (రోమా 9:20 చూడు) ఎన్నడు సమస్యను పరిష్కరించదు, కాని తన్ను తాను గాయపరచుకొనడం దుఃఖం కలిగించు కొనడం అనే ఫలితాలనిస్తుంది. కీడు విషయమైన సమస్యలు సంపూర్ణంగా పరిష్కారం కావని కన్పించినప్పుడు, ఒకని జీవితంలోనికి కలతలు వచ్చినప్పుడు, ప్రభువును ప్రేమించి ఆయనయందు నమ్మికయుంచు నరుడు ధన్యుడు. మనకు అర్థం కాకపోయినా, “దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి” (రోమా 8:28).

---

సూచనలు

[1]NASB కీడు అనేదానికి బదులు “ఉపద్రవము” అని అంది. [2]David Hume, “Dialogues Concerning Natural Religion,” in *Hume Selections*, ed. Charles W. Hendel Jr. (New York: Charles Scribner’s Sons, 1955), 365. [3]సమస్తం “చాలా మంచిదిగా” నున్నప్పుడు ఏ కీడూ లేదు; అయితే పాపం వచ్చినప్పుడు, కీడు కలిగిస్తానని దేవుడు తెలియజేశాడు (యెషయా 45:7) శిక్షగా, యిర్మీయా 25:29; 44:27; మీకా 1:12; 2:3; కీర్తన. 125:4, 5; యెషయా 31:2; దానియేలు 9:14లను కూడా చూడు.